క్లుప్తంగా

పోలింగ్ సిబ్బంది అలసత్వం

- మాక్ పోలింగ్ తొలగించకుండానే ఎన్నికల ప్రక్రియ కొనసాగింపు
- ఉన్నతాధికారులకు మాక్ పోలింగ్ వివరాల నివేదిక

పెదకాకాని: మాక్ పోలింగ్ తొలగించకుండా ఓటింగ్ ప్రక్రియ కొనసాగించడంతో గందరగోళం నెలకొంది. పోలింగ్ సిబ్బంది బాధ్యతా రాహిత్యానికి ఇది నిదర్శనంగా మారింది. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో 64 పోలింగ్ బూత్‌లో మాక్ పోలింగ్ నిర్వహించి వాటిని క్లియర్ చేయకుండానే ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. సాయంత్రం మాక్ పోలింగ్ సంఖ్య తొలగించలేదని గుర్తించిన ఉన్నతాధికారులు 17సి రిజిష్టర్‌లో నివేదిక అందజేశారు. ఆ పోలింగ్ స్టేషన్‌కు చేరుకున్న పోలింగ్ పర్యవేక్షణ అధికారులు పోలింగ్ బూత్ అధికారి ముందుగా వేసిన మాక్ పోలింగ్ సంఖ్య 50 గా గుర్తించారు. మాక్ పోలింగ్‌కు సంబంధించిన సంఖ్యను క్లియర్ చేయకుండానే పొరపాటున ఎన్నికల ప్రక్రియ కొనసాగించడం జరిగిందన్నారు. ఆ ఓట్ల సంఖ్య నుంచి 50 ఓట్లు తగ్గించాలని నిర్ణయించినట్లు చెప్పారు. వాటిలో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పోల్ అయ్యాయో వాటి వివరాలతో కూడిన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించినట్లు అధికారులు వెల్లడించారు.

బుల్లిబాబు మృతికి కారుకులను శిక్షించాలి

నెహ్రూనగర్: బుల్లిబాబు మృతికి కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీస్ జిల్లా నాయకులు కూచిపూడి సత్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మార్చురీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ పదేళ్లుగా వడ్డమాను గ్రామంలో ఓ కుటుంబం వద్ద కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడని...సోమవారం పొలాల్లో శవమై కనిపించాడని... ఒంటిపై తీవ్ర గాయాలతో చనిపోయిన బుల్లిబాబు మృతి చెందినట్లు చెప్పారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

21 నుంచి ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి విద్యార్థులకు ఈనెల 21వ తేదీ నుంచి పదిరోజుల పాటు ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు ఉచితంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్(సన్) కన్వీనర్ కె. సాయికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామన్నపేట ఒకటో లైనులోని జనచైతన్య వేదిక కార్యాలయంలో ప్రతి రోజూ సాయంత్రం 6.00 గంటల నుంచి రెండు గంటల పాటు తరగతులు ఉంటాయని చెప్పారు. పాఠశాల స్థాయి విద్యార్థులు హాజరు కావచ్చునని పేర్కొన్నారు. పేర్లు నమోదు చేసుకునేందుకు 72075 66702, 63094 81514, 86888 97406లో సంప్రదించాలని సూచించారు. సివిల్స్ శిక్షణ నిపుణులు, ఉన్నతాధికారులు తరగతులను బోధిస్తారని పేర్కొన్నారు.

తొలి సారి ఓటేసిన యానాదులు



నెహ్రూనగర్: కాకుమానువారితోటలో నివాసం ఉండే యానాదులు 2024 సార్వత్రిక ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారు సంచార జాతులు కావడంతో సరైన పత్రాలు లేకపోవడంతో వారెవరికి ఓటు హక్కు లేదు. వారి సమస్యను తెలుసుకున్న బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్ అధికారులతో మాట్లాడి వారికి ఓటర్ కార్డు, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఇప్పించారు.

నేడు వైకే నాగేశ్వరరావు స్మారక పురస్కారాల ప్రదానం

నగరంపాలెం: సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు ఆధ్వర్యంలో యువ కళావాహిని నిర్వహణలో వైకే నాగేశ్వరరావు స్మారక పురస్కారాలను బుధవారం ప్రదానం చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు లంకా లక్ష్మీసూర్యనారాయణ, కార్యదర్శి జి.మల్లికార్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై హాస్యరస సార్వభౌమ డాక్టర్ శంకరనారాయణ, లఘు చిత్ర దర్శకుడు గుమ్మడి ప్రేమ్‌చంద్, ప్రముఖ రంగస్థల నటి లహరి, ప్రముఖ రంగస్థల, పౌరాణిక నటులు డాక్టర్ ముప్పా పెదబాబురెడ్డిలకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా 'మూల్యం' అనే నాటిక ప్రదర్శించనున్నట్లు చెప్పారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి

అమరావతి: మండల పరిధిలోని ధరణికోట గ్రామంలో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు యువకుడు మరణించాడు. గ్రామస్తుల సమాచారం మేరకు బలుసుపాటి వినయ్(20) మంగళవారం గేదెలను తోలుకుని పొలానికి వెళ్లాడు. సాయంత్రం 4 గంటలకు ఉరుములు మెరుపులతో కూడి గాలివాన రావటంతో ఇంటికి పోదామని బయలుదేరుతుండగా ఒక్కసారిగా పిడుగుపడి వినయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం వినయ్ మృతదేహాన్ని అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. చేతికంది వచ్చిన కొడుకు మరణించటంతో వినయ్ తల్లిదండ్రులు రోదిస్తున్నారు.

ఓటుకు దూరం.. భవితకు శాపం

- ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఓటు వేయని వారు 46,798 మంది
- ఓటు వినియోగంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించినా కొందరిలో మార్పు శూన్యం
- శతాధిక వృద్ధులు సైతం ఓటు వినియోగించుకున్నా.. కొందరు యువతలో నిరాశక్తి

మండలాల వారీగా పోలింగ్ పర్సంటేజ్ వివరాలు..

మండలం	పోలింగ్ పర్సంటేజ్
ప్రత్తిపాడు	86.82 %
పెదనందిపాడు	85.76 %
వట్టిచెరుకూరు	87.81 %
కాకుమాను	86.16 %
గుంటూరువెస్ట్	79.35 %
గుంటూరుఈస్ట్	74.94 %



నడింపాలెంలో ఓటు వేసేందుకు వచ్చిన శతాధిక వృద్ధురాలు పి.కాంతమ్మ

ప్రత్తిపాడు: బద్ధకస్తులను ఎవ్వరూ మార్చలేరు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ఖండాంతరాలు దాటి స్వదేశానికి వచ్చిన వారు కొందరైతే, వృత్తి రీత్యా బతుకుతెరువు కోసం పొరుగు రాష్ట్రాలకు వెళ్లిన వారు మరికొందరు. వీరంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు స్వగ్రామాలకు తిరిగి వచ్చి వజ్రాయుధమైన ఓటు హక్కును వినియోగించుకున్నారు. చివరకు 102 ఏళ్ల బామ్మ, అడుగుతీసి అడుగువెయ్యలేని వృద్ధులు, వికలాంగులు వీల్‌చైర్లలో వెళ్లి మరీ ఓట్లేశారు. ప్రత్యేక అవసరాలు గల వ్యక్తులు సైతం వచ్చి ఓటు వేశారు. కానీ ఇక్కడే స్వగ్రామాల్లోనే ఉన్న వేల మంది బద్ధకస్తులు మాత్రం పోలింగ్ డే రోజున ఇంటి గడప దాటలేదు. ఏ వెయ్యో రెండు వేల మందో కానే కాదు. అక్షరాలా 46 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు.

నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,67,888 కాగా వారిలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 2,21,090 మంది ఓటర్లు మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంటే ఎన్నికల సంఘం అధికారిక లెక్కల ప్రకారం 46,798 మంది ఓటర్లు తమ ఓటు హక్కుకు దూరంగా ఉన్నారన్నమాట.

ఆయా మండలాల వారీగా ఓటు హక్కు వినియోగించుకోని వారి వివరాలు ఇలా ఉన్నాయి..

మండలం	ఓటర్లు	ఓటు వేసినవారు	ఓటు వేయని వారు
ప్రత్తిపాడు	40,623	35,267	5,356
పెదనందిపాడు	35,044	30,053	4,991
కాకుమాను	34,528	29,748	4,780
వట్టిచెరుకూరు	38,171	33,517	4,654
గుంటూరురూరల్	1,19,522	92,505	27,017
మొత్తం	2,67,888	2,21,090	46,79

పొన్నూరులో పెరిగిన పోలింగ్

- 264 పోలింగ్ కేంద్రాల్లో 84.92 శాతం ఓటింగ్ నమోదు
- 2019లో 83.62 శాతం పోలింగ్
- ఈ ఎన్నికలలో 1.30 శాతం పెరిగిన ఓటింగ్



ఓటు వినియోగించుకున్న ఓటర్లు

పొన్నూరు: పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసినా మండలంలోని ఇటికంపాడుతో పాటు పలు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 11 గంటల వరకు ఓటర్లు వేచి ఉండి తమ ఓటుహక్కు వినియోగించు కున్నారు. మంగళవారం ఉదయం 9 గంటల వరకు ఏఎన్‌యూలోని స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలను తరలించారు. పొన్నూరు నియోజకవర్గంలో మొత్తం 2,27,135 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికలలో పొన్నూరు అసెంబ్లీకి సంబంధించి 14 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 264 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం జరిగిన పోలింగ్‌లో 84.92 శాతం పోలింగ్ నమోదైనట్లు ఆర్వో లక్ష్మీకుమారి మంగళవారం ప్రకటించారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో పొన్నూరు నియోజకవర్గంలో 2,28,234 మంది ఓటర్లలో 1,90,849 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా 83.62 శాతం పోలింగ్ నమోదైంది. 2019 ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికలలో పోలింగ్ 1.30 శాతం పెరిగింది.

సుధాకర్‌ది కుల అహంకార దుశ్చర్యే

- శివకుమార్ గెలుపు అడ్డుకునే కుట్రలో భాగమే
- వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటూరు కృష్ణ

తెనాలి: వైఎస్సార్ సీపీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ గెలుపును అడ్డుకునే కుట్రలో భాగంగానే కూటమి పార్టీలు గొట్టుముక్కల సుధాకర్‌ను ప్రయోగించాయని ఆ పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటూరు కృష్ణ ఆరోపించారు. భార్యతో సహా ఓటు వేసి వస్తున్న శివకుమార్‌పై అసభ్యంగా మాట్లాడి దాడి చేయడాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో శివకుమార్ ఎదుగుదలను ఆయన సామాజిక వర్గానికే చెందిన కొందరు ఓర్చు కోలేకపోతున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల మద్దతుతో మళ్లీ ఎమ్మెల్యేగా గెలుస్తారని తెలిసీ, పోలింగ్ కేంద్రంలో గలభా సృష్టించి పోలింగ్ శాతాన్ని తగ్గించాలనేది సుధాకర్ దౌర్జన్యం వెనుక కుట్రగా పేర్కొన్నారు. ఓటరుగా శివకుమార్‌ను ప్రశ్నించవచ్చనీ, అడ్డుకోవటం, దుర్భాషలాడటం, కులాల ప్రస్తావన తీసుకురావటం ఎంతవరకు సబబని చెప్పారు. ఒక ప్రజా ప్రతినిధిని దుర్భాషలాడి, దాడిచేసి, ఏం జరిగిందో నాకు తెలీదు... గుర్తులేదు. వీడియోలో చూశాకే తెలిసిందని చెప్పటం చూస్తే అబద్ధాల కోరని ప్రజలకు అర్థమైందన్నారు. ఎమ్మెల్యే శివకుమార్ ఓటరుపై దాడి చేశాడంటూ సుధాకర్ చేసిన అహంకార పూరిత వ్యాఖ్యల్ని, కులాలను, వైఎస్సార్ సీపీని కించపరిచే విధానాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

వెల్లివిరిసిన చైతన్యం.. ఓటరులో నవ్యోత్సాహం

- పెదకాకానిలో 86.36 శాతం పోలింగ్
- తక్కెళ్ళపాడులో టీడీపీ నాయకుల బెదిరింపులు
- పలు బూత్‌లలో ఉదాసీనత కనబరచిన పోలింగ్ సిబ్బంది
- ప్రేక్షక పాత్ర వహించిన పోలీసులు



పెదకాకాని: సార్వత్రిక ఎన్నికల్లో సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు ఓటర్లు ఉత్సాహం కనపరచారు. తెల్లవారే సరికి పోలింగ్‌బూత్‌ల వద్ద బారులు తీరిన ఓటర్లు రాత్రి 10 గంటల వరకూ పలు పోలింగ్‌బూత్‌ల వద్ద ఓటు వేసేందుకు వేచి ఉన్నారు. పెదకాకాని మండలంలో గ్రామాల వారీగా.. పెదకాకాని 81.41 శాతం, నంబూరు 86.54 శాతం, తక్కెళ్ళపాడు 86.39, వెనిగండ్ల 90.32, ఉప్పలపాడు 87.16, కొప్పురావూరు 89.41, అగతవరప్పాడు 86.66, గోళ్ళమూడి 93.23, రామచంద్రపాలెం 87.33, వెంకటకృష్ణాపురం 91.97, తంగెళ్ళమూడి 97.11, అనుమర్లపూడి 92.86 శాతం పోలింగ్ నమోదైంది. పెదకాకాని మండలంలో 86.36 శాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. మండలంలోని పెదకాకాని, కొప్పురావూరు, నంబూరు, వెనిగండ్ల, అగతవరప్పాడు గ్రామాల్లోని ఐదు బూత్‌లలో ఈవీఎం మెషీన్లు మొరాయించడంతో ప్రారంభంలోనే ఓటింగ్ ప్రక్రియ 30 నుంచి 40 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. మధ్యాహ్నం సమయంలో ఎండలు బాగా మండిపోవడంతో పలు బూత్‌ల వద్దకు సాయంత్రం 4 గంటల నుంచి ఓటు వేసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు గ్రామాలలో టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడ్డారు. దొంగ ఓట్లు వేయడానికి ఒకరు రావడం, అక్కడే ఉన్న వారి సామాజిక వర్గం వారు ఒక్కసారిగా పోలింగ్ బూత్‌లలోకి చొరబడి బెదిరించడం, ఎట్టకేలకు ఓటు వేయడం వంటి సంఘటనలు పరిపాటిగా జరిగాయి. తక్కెళ్ళపాడులో ఓటర్లు పోలింగ్‌బూత్‌ల వద్దకు వెళ్లే సరికే పలువురు ఓట్లు వేసి ఉండటంతో నిరాశతో ఓటు వేయకుండానే వెనుతిరగడం జరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న పోలీసు సిబ్బంది ప్రేక్షక పాత్ర వహించారు. పోలింగ్ సిబ్బంది సైతం కొందరు ప్రభుత్వ వ్యతిరేక ఓటు వేసేందుకు పెత్తందార్లకు సహకరించారు.

ఓటు వేసేందుకు వెళ్తూ వృద్ధుడి మృతి

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని గుండిమెడలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వృద్ధుడి మరో వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు గ్రామంలోని కన్నారెడ్డి పాలేనికి చెందిన బొమ్మారెడ్డి మహాత్మారెడ్డి (70) సోమవారం 10 గంటల సమయంలో ఓటు వేసేందుకు గుండిమెడకు వెళ్లగా గుర్తింపుకార్డు లేదని అధికారులు వెనక్కి పంపించివేశారు. తిరిగి మరల 10.30 గంటల సమయంలో కన్నారెడ్డిపాలేనికి చెందిన మహాత్మారెడ్డి ఆధార్ కార్డు తీసుకుని ఇంటి దగ్గర నుంచి మెల్లెంపూడి గుండిమెడ రోడ్‌లో ద్విచక్రవాహనంపై వస్తుండగా మెల్లెంపూడి నుంచి వచ్చే మరో ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో మహాత్మారెడ్డి కిందపడిపోయాడు. ఈ సమయంలో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై మహాత్మారెడ్డి బంధువులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సాహిత్యంలో మాతృమూర్తికి విశిష్ట స్థానం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

నగరంపాలెం: ప్రాచీన భారతీయ సాహిత్యం నుంచి నేటి వరకు కవులు తమ కావ్యాల్లో మాతృమూర్తికి విశిష్ట స్థానం కల్పించారని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ బీరం సుందరరావు అన్నారు. గుళ్ళపల్లి సుబ్బారావు సేవా సంస్థ సౌజన్యంతో రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై మంగళవారం అంతర్జాతీయ మాతృదినోత్సవ సభ మంగళవారం నిర్వహించారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షురా లు డాక్టర్ తూనుగుంట్ల రాధాభాయ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ బీరం సుందరరావు మాట్లాడుతూ మన సంస్కృతిలో మాతృమూర్తికి విశిష్ట స్థానం ఉందని అన్నారు. తద్వారా మనం మాతృదేవోభవః అని ముందుగా తల్లికి ప్రణవిల్లుతామని పేర్కొన్నారు. సంస్థ కార్యదర్శి ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి, మంజుల మాట్లాడగా, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అతిథులను గుళ్లపల్లి సేవా సంస్థ నిర్వాహకులు గుళ్లపల్లి రాఘవేంద్రరావును సత్కరించారు.

జనచైతన్య గ్రూప్ సంస్థల డైరెక్టర్ శకుంతల అంత్యక్రియలు



అంతిమయాత్ర దృశ్యం

నగరంపాలెం: జనచైతన్య గ్రూపు వ్యవస్థాపకురాలు మాదల శకుంతల(86) అంత్యక్రియలు మంగళవారం స్తంభాలగరువులోని మహాప్రస్థానంలో మంగళవారం నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని ఆమె నివాసం వద్దకు పలువురు పుర ప్రముఖులు చేరుకుని నివాళులర్పించారు. ఆమె కుమారులు మాదల రత్నగిరిబాబు, జన చైతన్య గ్రూపు సంస్థల చైర్మన్ మాదల సుధాకర్‌లను ఓదార్చారు. గుంటూరు పార్లమెంట్, ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థులు పెమ్మసాని చంద్రశేఖర్, గళ్లా మాధవి, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రులు నక్కా ఆనంద్ బాబు, కొమ్మాలపాటి శ్రీధర్‌బాబు, డాక్టర్ రాయపాటి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ కంభంపాటి నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ప్రముఖ వైద్యులు మద్దినేని గోపాలకృష్ణ, పయినీర్ గ్రూప్ సంస్థల చైర్మన్ చుక్కపల్లి రమేష్, భారతీయ ఆధ్యాత్మిక సంస్థ వ్యవస్థాపకులు బొల్లేపల్లి సత్యనారాయణ, శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థాన కమిటీ ఆర్గనైజర్లు సీహెచ్ మస్తానయ్య, నూతలపాటి తిరుపతయ్య, దాసరి హనుమంతరావు పలువురు శకుంతల భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాదల రత్నగిరిబాబు మాట్లాడుతూ తల్లి శకుంతల తమను ఎంతో కష్టపడి పెంచారని అన్నారు. జనచైతన్య గ్రూప్ సంస్థలను ఎంతగానో అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. జనచైతన్య గ్రూప్ సంస్థల చైర్మన్ మాదల సుధాకర్ మాట్లాడుతూ తల్లి శకుంతల లేని లోటు తీరనిదని అన్నారు. ఆమె ఆదేశానుసారం అనేక సంస్థలు, వ్యక్తులు, దేవాలయాలు, ధార్మిక సంస్థలకు ఆర్థిక సహకారాలు అందించామని చెప్పారు. భవిష్యత్తులో ఆమె ఆశయాలు, ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకెళ్తామని అన్నారు.

దొంగ ఓట్లకు తెగబడిన టీడీపీ

- పలుచోట్ల బూత్ ఏజెంట్లపై దాడికి ప్రయత్నం
- వేరే ప్రాంతం వారిని బూత్‌లకు తీసుకొచ్చిన పచ్చబ్యాచ్
- అడ్డుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు
- రెచ్చగొట్టేందుకు ప్రయత్నం



నులకపేట బూత్ వద్ద వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడికి పాల్పడుతున్న టీడీపీ కార్యకర్తలు

తాడేపల్లిరూరల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు దొంగ ఓట్లు వేసేందుకు సోమవారం విశ్వప్రయత్నాలు చేశారు. దానిని అడ్డుకున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడికి పాల్పడ్డారు. వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు ఓటు వేయనీయకపోతే అధికారంలోకి వచ్చేది మేమే అంటూ అధికారులను బెదిరించేందుకు ప్రయత్నాలు చేశారు. ఉండవల్లిలో ఓటుహక్కు వినియోగించుకున్న ఓ వ్యక్తిని నులకపేటలో ఓటు వేయడానికి వచ్చాడు. అది గమనించిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. ముక్కు మొహం తెలియని వ్యక్తిని తీసుకువచ్చి నులకపేట జిల్లాపరిషత్ పాఠశాలలో ఓటు వేసేందుకు తీసుకు వెళ్లగా వైఎస్సార్‌సీపీ బూత్ ఏజెంట్ ప్రశ్నించడంతో మద్యం మత్తులో దాడికి పాల్పడ్డారు. బయటకు పంపించడానికి ఇలాంటి ఎత్తుగడలు వేస్తున్నారని గమనించి వైఎస్సార్ సీపీ ఏజెంట్ కదలలేదు. దొంగ ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తిని బయట ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఓటు స్లిప్ చూపించమని అడుగుతుండగా టీడీపీకి చెందిన కొంతమంది నోటికి వచ్చినట్లు బూతులు తిడుతూ వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను కొట్టేందుకు యత్నించారు. ఇదే సమయంలో ఇద్దరు అన్నదమ్ములు మద్యం మత్తులో బూత్‌లోపలకు చొచ్చుకుని వెళ్లి బూత్ ఏజెంట్లపై మరోసారి దాడికి పాల్పడ్డారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇద్దరు అన్నదమ్ములకు బయటకు తీసుకురాగా పోలీసులపై దురుసుగా ప్రవర్తిస్తూ అధికారంలోకి వచ్చేది మేమేనంటూ నోటికి వచ్చినట్లు అసభ్యంగా మాట్లాడారు. బయటకు వచ్చి వైఎస్సార్ సీపీ నాయకులపై దాడికి పాల్పడ్డారు. వీరు ప్రతిఘటించడంతో పక్కనే ఉన్న ఇటుక రాళ్ల గుట్ట నుంచి రాళ్లు తీసి ఓటు వేస్తున్నవారిపై విసిరారు. బూత్ ఏజెంట్ ఇంటిపై పెట్రోల్ పోసి తగలబెడతాం అని చెప్పడంతో సదరు బూతు ఏజెంట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా తిరిగి వీరు కూడా కేసు పెట్టేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ప్రతి బూత్‌లో సీసీ కెమెరాలు పెట్టిందని, ఎవరో వస్తే ప్రశ్నించడం నేరమా? సీసీ కెమెరాలు పరిశీలించి ఎవరు తప్పు చేస్తే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా ఉండవల్లి తాడేపల్లిలో పలుచోట్ల దొంగ ఓట్లు వేశారు. అసలు ఓటు కలిగిన వ్యక్తులు చాలెంజ్ ఓట్లు అడిగి మరీ వేయించుకున్నారు. తెలంగాణ నుంచి టీడీపీ కార్యకర్తలను తరలించి ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అంటున్నారు. ఇప్పటి వరకు దొంగ ఓట్లు వేయడానికి వచ్చిన వారి పేర్లు బయట పెట్టడం లేదని, వారి ఓటు హక్కు ఎక్కడ ఉందో టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు దమ్ముంటే వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. ఘటనపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ బూత్ ఏజెంట్ ఫిర్యాదు చేయగా మంగళవారం టీడీపీ నాయకులు బూత్ ఏజెంట్‌పై కేసు పెట్టేందుకు యత్నించారు. లోపల ఉన్న బూత్ ఏజెంట్లపై టీడీపీ నాయకులు ఏ విధంగా కేసు పెడతారో చెప్పాలని వైఎస్సార్ సీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు.

మహిళపై టీడీపీ కార్యకర్తల దాష్టీకం

వైఎస్సార్ సీపీ ఏజెంట్‌గా ఉందని..

మంగళగిరి: వైఎస్సార్ సీపీ తరపున ఎన్నికల ఏజెంట్‌గా పనిచేసిన మహిళపై టీడీపీ కార్యకర్తలు దాష్టీకానికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగర పరిధిలోని నీరుకొండ శిబిరం పోలింగ్ కేంద్రంలో సోమవారం జరిగిన ఎన్నికలలో స్థానిక వైఎస్సార్ సీపీ కార్యకర్త సిహెచ్.దివ్య పోలింగ్ ఏజెంట్‌గా ఉంది. రాత్రి ఏడు గంటల సమయంలో దివ్య పోలింగ్ ముగిసిన అనంతరం బయటకు వస్తుండగా స్థానిక టీడీపీ కార్యకర్తలు దిడ్ల నీలాంబరం, అంబేడ్కర్, వైఎస్సార్ సీపీ తరపున ఎందుకు ఏజెంట్‌గా ఉన్నావంటూ దివ్యను నిలదీయడంతో నా ఇష్టం అని దివ్య అనడంతో వాగ్వివాదం చోటు చేసుకోగా అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు దాడికి ప్రయత్నించారు. స్థానికుల సహకారంతో దివ్య పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


సీబీఎస్ఈ ఫలితాల్లో సీతారామయ్య స్కూల్ ప్రతిభ



విద్యార్థులతో శివాజీ, విష్ణువర్ధన్, హనుమంతరావు, వరప్రసాదరావు, కృష్ణవేణి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: సీబీఎస్ఈ బోర్డు సోమవారం ప్రకటించిన టెన్త్ ఫలితాల్లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాఠశాలలో మంగళవారం విద్యార్థులను అభినందించారు. తమ పాఠశాల రెండో బ్యాచ్ నుంచి పరీక్షలు రాసిన 38 మంది విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా వారిలో 26 మంది ప్రథమ శ్రేణిలో ఫలితాలను సాధించారని చెప్పారు. సుంకర గాయత్రి 500 మార్కులకు 470, గూడపాటి దినేష్ కార్తీక్ చౌదరి 464, ఆశిం షేక్ 458 మార్కులతో తొలి మూడు స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. క్రమబద్ధమైన విద్యా ప్రణాళిక, ఉపాధ్యాయుల అత్యుత్తమ బోధన, విద్యార్థుల కృషి, పట్టుదలతో తిరుగులేని ఫలితాలను సాధించినట్లు పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, అధ్యక్షుడు దేవినేని మల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు పేర్కొన్నారు. ఈసందర్భంగా పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో-ఆర్డినేటర్లు దుర్గాశ్యామ్, శ్రీదేవి విద్యార్థులను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి ఓల్డ్ టోల్‌గేటు వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆశ్రమం రోడ్డు నుంచి గుంటూరు- విజయవాడ సర్వీస్ రోడ్‌లోకి ద్విచక్ర వాహనంపై వస్తున్న రాజ్ బహదూర్ శంకర్ పండిట్‌ను విజయవాడ గుంటూరు వైపు సర్వీస్‌రోడ్‌లో వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన పండిట్, సీలింగ్ పనులు చేస్తూ విజయవాడ కృష్ణలంకలో నివాసముంటున్నాడు. సోమవారం రాత్రి సమయంలో ఆశ్రమం రోడ్‌లో పనులు చేసి తిరిగి ఇంటికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని, ఈ ప్రమాదంలో పండిట్‌తో పాటు గాయపడిన శ్రీనివాసరావును స్థానికులు 108లో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారని చెప్పారు. ఢీ కొట్టిన వారు ద్విచక్రవాహనాన్ని వదిలి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. జరిగిన ఈ ఘటనపై రాజ్ బహదూర్ శంకర్ పండిట్ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మానస సరోవరంలో బుద్ధపౌర్ణమి వేడుకలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మహానాడు ప్రాంతంలో ఉన్న మానస సరోవరంలో ఈనెల 23వ తేదీ బుద్ధపౌర్ణమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రామిరెడ్డి, రమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేడుకలు నిర్వహించనున్నామని, ఈ వేడుకలకు కవి, రచయిత, జాతీయ సాహిత్య సేవా అవార్డు గ్రహీత, డాక్టర్ బొర్రా గోవర్ధన్ విచ్చేయనున్నారని చెప్పారు.